అన్నదాత ఉరుకులు పరుగులు

- ముమ్మరంగా దాళ్వా పనులు
- బెంబేలెత్తిస్తున్న వాతావరణం
- పంటను ఒబ్బిడి చేసుకునే పనిలో నిమగ్నం


మండపేటలో పంటను ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు ఉరుకులు, పరుగులు

మండపేట: గంపెడాసతో రబీ ఫలసాయం కోసం ఎదురు చూస్తున్న వేళ వాతావరణం రైతులను కలవరపెడుతోంది. దాళ్వా కోతలు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై జల్లులు పడుతుండడంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. పంటను ఒబ్బిడి చేసుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

డివిజన్‌లోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో 93 వేల ఎకరాల్లో రైతులు రబీ సాగు చేశారు. ప్రస్తుతం కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే 40 శాతం మేర కోతలు పూర్తయ్యాయి. అధిక శాతం విస్తీర్ణంలో వరికోత యంత్రాలను వినియోగిస్తుండడంతో ధాన్యంలో తేమ శాతాన్ని తగ్గించుకునేందుకు ధాన్యాన్ని పొలాల్లోను, రోడ్ల వెంబడి ఆరబెట్టుకుంటున్నారు. మరోపక్క మిగిలిన విస్తీర్ణంలో కోతలు పూర్తిచేసేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా రెండు రోజులుగా ఈదురు గాలులు, అకాల వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఒక్కసారిగా కారుమబ్బులు కమ్ముకుని వర్షం కురుస్తుండడంతో ఆరబెట్టిన ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వస్తోంది.

పగటిపూట ఎండ తీవ్రత మేలు చేస్తుందని ఆశిస్తుంటే సాయంత్రం అవుతుండే సరికి కారుమబ్బులు కమ్ముకుని జల్లులు పడుతుండటం ఆందోళనకు గురిచేస్తోంది. ఒక్కోసారి పగటిపూట కూడా ఒక్కసారిగా కారుమబ్బులు కమ్ముకుని ఈదురు గాలులు వీస్తుండటంతో ఆరబెట్టిన ధాన్యాన్ని మరలా రాసులు పోసుకుని బరకాలు కప్పేందుకు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని జల్లులు పడడంతో అప్పటికప్పుడు హడావుడిగా ధాన్యం తడకుండా బరకాలు కప్పుకోవాల్సి వచ్చింది. వాతావరణం ఎప్పుడు ఎలా ఉంటుందో తెలీక ధాన్యం ఆరబెట్టుకునేందుకు కూలీలు తడిసిమోపెడవుతున్నాయని వాపోతున్నారు. ఎక్కడికక్కడ రైతులు కళ్లాల్లోని ధాన్యంపై బరకాలు కప్పి ఉంచుతున్నారు. వాతావరణ పరిస్థితులతో ఇంకా కోతలు కోయాల్సిన రైతులు వెనుకంజ వేస్తున్నారు. ధాన్యం తడిసిపోతే తేమ శాతం పెరిగిపోయి ధర తగ్గిపోతుందంటున్నారు. వారం పది రోజులు పాటు వాతావరణం అనుకూలిస్తే చాలా వరకు పంట ఒబ్బిడి అయిపోతుందని రైతులు అంటున్నారు.


వెదురుపాకలో ఉరుకులు పరుగులతో ధాన్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్న అన్నదాతలు


రాయవరంలో ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్న ధాన్యంపై బరకం కప్పుతున్న డ్రైవర్

గంటసేపు వర్షం

రాయవరం: అకాల వర్షం రైతన్నకు నష్టాన్ని మిగిల్చింది. శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా భారీగా మబ్బులు కమ్ముకుని వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో పాటు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం సుమారు గంట సేపు కురిసింది. వర్షానికి ప్రధాన రహదారులతో పాటు, పల్లపు ప్రాంతాలు కూడా జలమయం అయ్యాయి. ఇప్పటికే వరినూర్పిళ్లు చేపట్టి రహదారులపైన, కళ్లాల్లోనూ ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసింది. రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకున్న సమయంలో వచ్చిన వర్షంతో అన్నదాతలు ధాన్యాన్ని వర్షం బారిన పడకుండా ఉండేందుకు నానాపాట్లు పడ్డారు. ఈ నెల 23న వర్షం వచ్చి రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కోగా తిరిగి మరోసారి వచ్చిన వర్షం రైతులకు ఇబ్బందులు తెచ్చిపెట్టింది. అయితే వర్షం వెలిసిన అనంతరం తిరిగి సాధారణ పరిస్థితి నెలకొంది.

క్లుప్తంగా

చెరువు పనులు పరిశీలించిన డ్వామా పీడీ


ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ మధుసూదన్

రాయవరం: మండలంలోని వెంటూరులో జరుగుతున్న అమృత్ సరోవర్ ట్యాంక్ పనులను డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టరు ఎస్.మధుసూదన్ శనివారం పరిశీలించారు. స్థానిక నారమ్మ చెరువును అమృత్ సరోవర్ పనుల్లో భాగంగా ఉపాధి హామీ పథకంలో పూడిక తీత పనులు చేయిస్తున్నారు. రూ.13.25 లక్షల అంచనా వ్యయంతో 4,666 మందికి పనిదినాలు కల్పించే లక్ష్యంతో ఉపాధి పనులు చేపట్టారు. ఇప్పటి వరకూ 3,200 పని దినాలు చేపట్టినట్లు ఏపీవో సుధారాణి తెలిపారు. పనులు జరుగుతున్న తీరును పీడీ మధుసూదన్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీడీ కె.సత్యనారాయణ, జేఈ ఎం.ఈశ్వరరావు, ప్లాంటేషన్ మేనేజరు ఎం.త్రినాథ్, ఫీల్డ్ అసిస్టెంట్ బి.భాస్కరరావు, వి.ముత్తు, ఉపాధి హామీ కూలీలు, మేట్స్ హాజరయ్యారు.

రేపు నీటి సరఫరాకు అంతరాయం

మండపేట: పట్టణంలోని బురగుంట చెరువు వద్ద గల రిజర్వాయర్ అవుట్‌లెట్ వాల్వు మరమ్మతుల కోసం మే 1వ తేదీ సాయంత్రం నుంచి 2వ తేదీ ఉదయం వరకూ తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని శనివారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.

2న సర్వ సభ్య సమావేశం

కె.గంగవరం: మే 2న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు తప్పక హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయి నివేదికతో సభకు హాజరు కావాలని ఆయన కోరారు.

సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బందికి సన్మానం


పంచాయతీ సచివాలయ, వైద్య సిబ్బందిని సత్కరిస్తున్న సర్పంచ్ ఆరిఫ్ తదితరులు

రాయవరం: మండలంలోని సోమేశ్వరం పంచాయతీ పరిధిలోని సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బందిని సర్పంచ్ ఆరిఫ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఆరిఫ్ మాట్లాడుతూ సోమేశ్వరం పంచాయతీ ప్రజలకు అందిస్తున్న సేవలకు జిల్లా స్థాయిలో మూడు అవార్డులు, మండల స్థాయిలో వివిధ విభాగాల్లో ఉత్తమ సేవా అవార్డులు అందుకోవడం వెనుకు ఉద్యోగుల సేవలే కారణమన్నారు. సమావేశంలో ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, సొసైటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, సోమేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో నిర్మాణ కార్మికుడి మృతి

కపిలేశ్వరపురం: అంగరకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు శనివారపు కిశోర్ (25) తాతపూడిలో శుక్రవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్టు శనివారం అంగర ఎస్సై జి.చంటి తెలిపారు. ఆయన కథనం ప్రకారం... కిశోర్ తాతపూడిలో అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనికి వెళ్లాడు. పని చేస్తుండగా విద్యుత్ ఘాతానికి గురైనట్టు సమాచారం అందుకున్న అతని తండ్రి శనివారపు సూరిబాబు వెళ్లి చూడగా తన కుమారుడు కిశోర్ చనిపోయి ఉన్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చంటి తెలిపారు.

సబ్‌జైలు సందర్శించిన జడ్జి మాధవీదేవి


రామచంద్రపురం సబ్ జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి మాధవీదేవి

రామచంద్రపురం: పట్టణంలోని సబ్ జైలును రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ చైర్మన్ కె.మాధవీదేవి శనివారం సందర్శించారు. ఖైదీలకు ఏమైనా సమస్యలు ఉంటే స్వయంగా తనతో చెప్పాలని ఆమె సూచించారు. వివిధ కేసుల్లో వచ్చిన వారికి న్యాయవాదులు ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. సత్ప్రవర్తనతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జైలు సూపరింటిండెంట్ రమణబాబు, లోక్ అదాలత్ యూడీసీ ఉమా, ప్యానల్ అడ్వకేట్ దొమ్మలపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆశయ సాధనకు జగన్ కృషి

కాజులూరు: రైతును రాజు చేయాలన్నా దివంగత నేత వైఎస్సార్ ఆశయ సాధన కోసం సీఎం జగన్ అహర్నిశలు కృషి చేస్తున్నారని రాష్ట్ర సమాచార, బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని శీల గ్రామానికి చెందిన శ్రీరామలక్ష్మణ రైతు సంఘానికి వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా రూ.25 లక్షలు విలువజేసే వరికోత యంత్రాన్ని మంత్రి వేణుగోపాలకృష్ణ ప్రారంభించి రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ నాడు వ్యవసాయం దండగ అని చంద్రబాబు ప్రకటిస్తే వైఎస్సార్ జలయజ్ఞం, ఉచిత విద్యుత్ వంటి పథకాలు ప్రవేశపెట్టి వ్యవసాయాన్ని పండగ చేశారన్నారు. అయన ఆశయసాధనలో బాగంగానే ముఖ్యమంత్రి జగనన్న ప్రతి గ్రామంలోనూ ఆర్బీకేలను ఏర్పాటు చేసి రైతులకు అనేక విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. వరికోత యంత్రం ద్వారా కూలీల


వరికోత యంత్రాన్ని నడిపి ప్రారంభిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

ఖర్చు లేకుండా రైతులు పండించిన పంటను సునాయాసంగా నూర్పిళ్లు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో శీల సర్పంచ్ కోమలి వెంకటరమణ, మండల పార్టీ బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, పార్టీ నాయకులు నల్లమిల్లి రామారెడ్డి, దొమ్మేటి కొండ, పెంకే వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీయాలి

- డీజీపీ ఆఫీసు ఎస్పీ సూర్యభాస్కరరెడ్డి
- పసలపూడి ఆదర్శ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం

రాయవరం: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా బోధన సాగించాలని డీజీపీ కార్యాలయ ఎస్పీ కొవ్వూరి సూర్యభాస్కరరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని పసలపూడి మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు సూర్యభాస్కరరెడ్డి మాట్లాడారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుందని, దానిని ఉపాధ్యాయులు గుర్తించి ప్రోత్సహించాలన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులపై తమ అభిప్రాయాలను రుద్దకుండా, వారి టాలెంట్‌ను బట్టి ప్రోత్సహించాలన్నారు. తాను ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఈ స్థాయికి వచ్చినట్లు సూర్యభాస్కరరెడ్డి గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలకు కర్రి వెంకటరామారెడ్డి జ్ఞాపకార్థం సుమారు రూ.20 లక్షల విలువైన మూడు సెంట్ల స్థలాన్ని ఇచ్చిన దాత కర్రి రాజశేఖర రెడ్డితో పాటుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న చింతా సుబ్బారెడ్డి, చైతన్య రాజబాబులను ప్రగతి రామారెడ్డి ఆధ్వర్యంలో ఎస్పీ సూర్యభాస్కరరెడ్డి ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలను


ఎస్పీ సూర్యభాస్కరరెడ్డిని సత్కరిస్తున్న త్రినాథరెడ్డి, రాజబాబు, సుబ్బారెడ్డి, ప్రగతి రామారెడ్డి తదితరులు

దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్న ప్రగతి రామారెడ్డి వ్యక్తులను మిగిలిన వారు స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు ప్రశంసించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎస్పీ సూర్యభాస్కరరెడ్డిని ఘనంగా సత్కరించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మెరిట్ విద్యార్థులకు డీఆర్‌సీ రెడ్డి సౌజన్యంతో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కదలి పద్మావతి, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలి

మండపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మండపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అఖండ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాటుపడాలని ఆ పార్టీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడు అన్నారు. పార్టీలో కొత్తగా చేరిన టేకిమూడి శ్రీనివాస్ శనివారం తన ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులతో పాపారాయుడిను స్థానిక కామత్ ఆర్కెడ్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, మండలంలోని పార్టీ నాయకులతో శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. సర్పంచులు బూరిగ ఆశీర్వాదం, మట్టపర్తి గోవిందరాజులు, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్, పార్టీ నాయకులు సాదే పిడుగురాముడు, తోరం శ్రీనివాస్, చిన్ని గంగాధరం, పంపన పద్మారావు, బూర చిన్న, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.


శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న పాపారాయుడు, వెంకన్నబాబు తదితరులు

‘నాడు-నేడు’తో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

కాజులూరు: నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టిందని గొల్లపాలెం పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ మాత నాగరాజు అధ్యక్షతన జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ‘ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపరచాలి’ అంటూ గతంలో పలు సభలు, సమావేశాలలో అప్పటి నాయకులు తరచూ ప్రసంగాలు చేస్తుండేవారని అయితే దానికనుగుణంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవటంతో వారి మాటలు నీటిమూటలుగా మిగిలేవన్నారు. సీఎం జగన్ విద్యకు ప్రాధాన్యమిస్తూ ‘నాడు-నేడు’ పథకం ద్వారా పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయడంతో వాటి రూపురేఖలే మారిపోయాయన్నారు. పాఠశాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో పేరెంట్స్ కమిటీ సభ్యులు భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధ్యానోపాధ్యాయిని వెంకటలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయులు జి.సునీల్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు తోట కృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


గొల్లపాలెం సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ శ్రీరామారెడ్డి

ఇంటిగ్రేటెడ్ శిక్షణతో పార్టీ పటిష్టత

మండపేట: సాంకేతిక విధానంలో టీడీపీ పటిష్టతకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ దోహదపడుతుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండపేట నియోజకవర్గ పరిశీలకుడు చిన్నం బాబూరమేష్, అమలాపురం పార్లమెంటరీ టీడీపీ కో -ఆర్డినేటర్ మానేపల్లి బాలాజీ వేమా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టిడ్కో ప్లాట్లలో వాటర్ లీకేజీలు

- నిలదీసిన అధికార పక్షం సభ్యులు
- నాణ్యతకు టీడీపీ ప్రభుత్వం తిలోదకాలిచ్చిందని మండిపాటు
- పరిశీలనకు ఎమ్మెల్సీ తోట ఆదేశం
- మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మండపేట: పట్టణంలోని గొల్లపుంత కాలనీలో నిర్మించిన టిడ్కో ప్లాట్లలో అప్పుడే శ్లాబ్ నుంచి వాటర్ లీకేజీలు వస్తున్నాయని అధికార పక్షం సభ్యులు పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వం నాణ్యతకు తిలోదకాలిచ్చి నిర్మాణాలు చేసిందని మండిపడ్డారు. వాటర్ లీకేజీలను పరిశీలించి నివేదిక అందజేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన శనివారం జరిగింది. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్సీ తోట హాజరయ్యారు. ఈ సందర్భంగా 29వ వార్డు కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కొద్దిపాటి వర్షానికే టిడ్కో ప్లాట్లలో శ్లాబుల నుంచి నీరు లీకవుతుండడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. పేదల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా టిడ్కో ప్లాట్లు నిర్మించామని చెప్పుకునే ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, టీడీపీ నాయకులు దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. టీడీపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ మేన్ హోల్స్ మూసుకుపోవడం వలన పైప్‌లైన్లు లీకేజీ వచ్చి ఉండవచ్చునని, వాటిని సరిచేయించాలన్నారు. చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ప్లాట్ల వద్ద పర్యటించినప్పుడు శ్లాబులు చెమాయిస్తున్నట్టు స్థానికులు తన దృష్టికి తెచ్చారని, అందుకు సంబంధించిన ఫొటోలను చూపించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పైప్‌లైన్లు లీకేజీలు ఉంటే సమస్య పరిష్కారానికి మున్సిపాలిటీ పరంగా చర్యలు చేపట్టాలని కమిషనర్ టి. రామ్‌కుమార్‌ను ఆదేశించారు. అలాగే లీకేజీలకు గల కారణాలపై నివేదికను తయారు చేయాలని సూచించారు. పట్టణంలో పరిశ్రమల కాలుష్యంతో ఇబ్బంది పడాల్సి వస్తోందని పలువురు సభ్యులు తెలిపారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులపై సమావేశంలో సభ్యులు చర్చించి ఆమోదించారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.


శ్లాబ్ చెమాయింపు ఫొటోలు చూపిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మంత్రి వేణును కలసిన నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్

రామచంద్రపురం రూరల్: నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ముమ్మిడివరం నియోజకర్గ నాయకురాలు కాపవరపు శ్రీదేవి శనివారం రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి బైలపూడి రామకృష్ణ, జిల్లా కోశాధికారి వడ్డాది ధరణి, పట్టణ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ముచ్చుమిల్లి దుర్గారావు, అడివరపు ప్రసాద్ పాల్గొన్నారు.

విచారణ వేగవంతం చేయాలి

కాజులూరు: గొల్లపాలెంలో బయోడీజిల్ ట్యాంక్‌లో పడి మృతి చెందిన ఆర్యావటంకు చెందిన తాతపూడి మహేష్ (25), శీలకు చెందిన నెరేడుమిల్లి శివకుమార్ (25)ల అనుమానాస్పద మృతిపై పోలీసులు విచారణ వేగవంతం చేయాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. శనివారం రాత్రి హర్షకుమార్ తదితర నాయకులు ఆర్యావటం, శీల గ్రామాలలో మృతుల కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతదేహాలపై గాయాలు ఉన్నందున ఇది ముమ్మాటికి హత్యేనన్నారు. సంఘటన తీరును బట్టి హత్య జరిగినట్టుగా కుటుంబ సభ్యులు అభిప్రాయపడుతున్నారని దాని ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి ఎటువంటి రాజకీయాల ప్రమేయం లేకుండా దర్యాప్తు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కాజులూరు సర్పంచ్ దండంగి సరోజిని, స్థానిక మాజీ ఎంపీటీసీ రాగం పోలరాజు, పార్టీ నాయకులు వంగా శ్రీనివాస్, కాటే సుబ్రహ్మణ్యం, బండి అబ్బు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అందించాలి

కె.గంగవరం: ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ సూచనల మేరకు విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించామని సీనియర్ హెచ్‌ఎం యం.పుల్లయ్య అన్నారు. మండలంలోని పాణింగపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో కన్నా ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు బాగున్నాయని విద్య కూడా మెరుగయిందన్నారు. అనంతరం ఈ ఏడాదికి సంబంధించిన సోషల్ ఆడిట్‌లో 77 అంశాలను విద్యార్థులకు తల్లిదండ్రులకు వివరించి పాఠశాల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు సంబంధించిన ప్రోగ్రస్ కార్డులను వారికి అందించారు. విద్యా కమిటి చైర్మన్ చిన్నారి, ఇతర ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంటూ కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఎంపీసీ చదివిన గుడిమెట్ల హేమలత 1000 కి 966 మార్కులు సాధించడంపై వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి టి.వెంకటేశ్వర్లు, హాస్టల్ వార్డెన్ బి.సత్యవాణి ప్రత్యేకంగా అభినందించారు.

మెగా సర్వేతో విపక్షాలకు భవిష్యత్ లేదని తేలిపోయింది

మంత్రి చెల్లుబోయిన వేణు

రామచంద్రపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన నాలుగేళ్ల పాలనపై ప్రజల అభిప్రాయాలను నేరుగా తెలుసుకునేందుకు నిర్వహించిన ‘జగనన్నే మా భవిష్యత్’ మెగా సర్వేతో ప్రతిపక్షాలకు ఈ రాష్ట్రంలో భవిష్యత్ లేదని తేలిపోయిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. సర్వే విజయవంతం చేసిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులతో కలసి మంత్రి వేణు రామచంద్రపురం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మంత్రి వేణు మాట్లాడుతూ రాష్ట్రంలో 1.45 లక్షల కుటుంబాలను సర్వే చేస్తే సీఎం జగన్‌కి ఆ కుటుంబాల నుంచి సంపూర్ణ మద్దతు లభించిందన్నారు. దీనితో ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఉందంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి తదితర పత్రికలు, చానళ్లు చేస్తున్న దుష్ప్రచారంలోని డొల్లతనం తేటతెల్లమైందన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని 88 వేల కుటుంబాలను సర్వే చేస్తే 76 వేల కుటుంబాలు ప్రభుత్వానికి ‘జగనన్నే మా నమ్మకం’ అంటూ తమ సంపూర్ణ మద్దతు ప్రకటించాయన్నారు. కార్యక్రమంలో కాజులూరు జెడ్పీటీసీ వసుం సుబ్బారావు, రామచంద్రపురం మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మంత్రి వేణు, ప్రజాప్రతినిధులు

నియామక పత్రాల అందజేత


అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లోని ఐదుగురు అంగన్‌వాడీ కార్యకర్తలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా శనివారం నియామక పత్రాలు అందజేశారు. రామచంద్రపురం మండలంలోని తోటపేటకు గంటా దుర్గ, వెల్లకు కేతా దుర్గాభవాని, ద్రాక్షారామకు అమలదాసు నాంచారమ్మ, కె.గంగవరం మండలం బ్రహ్మపురికి దంగేటి స్వాతి, కె.గంగవరానికి సుంకర దేవిలకు మంత్రి వేణు నియామక పత్రాలు అందించారు. మంత్రి వేణు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు సొంత తల్లుల మాదిరిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ నున్న సత్యవతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, వీరబోయిన సూరిబాబు, సొసైటీ చైర్మన్ మేడిశెట్టి వెంకటరమణ, పంపన సుబ్బారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.నాగమణి, కె. అమ్మాజీ పాల్గొన్నారు.

అన్నివర్గాల లబ్ధికే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వెదురుమూడిలో గడప గడపకూ

కపిలేశ్వరపురం: అన్ని వర్గాల ప్రజల మేలుకోరి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వెదురుమూడిలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ చోడే రామ తులసి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైస్ ఎంపీపీ గుణ్ణం భానుప్రసాద్, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు మెర్ల రామకృష్ణ చౌదరి, నాయకులు చోడే సూరిబాబు, నక్కా సింహాచలంలతో కలిసి ఆయన ఇంటింటికీ పర్యటించారు. వైఎస్సార్ సీపీ నేత వేగుళ్ళ పట్టాభిరామయ్య, యువనేత తోట పృథ్వీరాజ్‌లు గ్రామంలో పర్యటించారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను సచివాలయ ఉద్యోగులు వివరించారు. ఇంటింటికీ వెళ్ళినప్పుడు ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వలంటీర్ వివరించారు. పలు ప్రయోజనాలకై ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలించి త్వరితగతిన ప్రతిపాదనలను చేయాలని అధికారులను ఎమ్మెల్సీ తోట ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాలా శ్రీనివాస్, బండారు స్వామినాయుడు, వనుం పార్థసారథి, బోణం సత్తిబాబు పాల్గొన్నారు.


వెదురుమూడి గ్రామస్తుల సమస్యలు వింటున్న ఎమ్మెల్సీ తోట